నూటఎనభై పౌనుల మొగుడు తనకక్కర్లేదని సీత కామేశ్వర్రావుకు చెప్పటమే కాక ఒక నూటఇరవై పాటిఫ్వాణ్ణి చూసి పెళ్ళిచేసుకుంది.

ఒక నెలకల్లా కామేశ్వర్రావు సన్నగా, పొడుగుగా, నాజూకుగా, దిగులుగా తయారయినాడు మళ్ళీ.

---

# కథా రచన

(అల్పిక)

చిన్న తనంలో కథలంటే నాలుక పీక్కునేవాడు. నిద్రాహారాలు మాని కథలు చదివేవాడు.

కాల క్రమాన కథలు రాయటం మొదలుపెట్టాడు. గాండీవంలోనుంచి బాణాలు వెలువడే వేగంతో కథా పరంపర వెలువడింది.

వంటవాడికి వంటకాలు రుచించవు. కథలురాయటం మీద ఆసక్తిపుట్టిన కొద్దీ చదవటం అలవాటు తప్పింది.

రాసేకథలో క్రమంగా పటుత్వం తప్పింది. కథలు నానాటికీ దిగనాసిల్లిపోతున్నై. ప్రజ్ఞకు పెనుగులాడుతున్నాడు.

"సరుకయిపోయింది!" అన్నారు నలుగురూ.

అయిపోయే దేముంది? కథాసాహిత్యం ఇతరత్రా వెలువడుతూనే ఉంది; కాని, పాపం, కథకుడు దాన్ని చదివేశక్తి పోగొట్టుకున్నాడు. దాని వెంట రాసేశక్తికూడా పోయింది.

---